క్లుప్తంగా

వీఆర్‌కు మంత్రాలయం సీఐ

మంత్రాలయం రూరల్: మంత్రాలయం సీఐగా పనిచేస్తున్న భాస్కర్‌ను వీఆర్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కర్నూల్ 3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న శ్రీనివాసులును మంత్రాలయం సీఐగా నియమించారు.

పొలం బడి కార్యక్రమం

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో వ్యవసాయ శాఖ ఏడీఏ మహ్మద్‌ఖాద్రి, ఏఓ గణేష్ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వేరుశనగలో పొగాకు లద్దె పురుగు జీవిత చక్రాన్ని, పంటకు జరిగే నష్టాన్ని, నివారణ చర్యలను క్షుణ్ణంగా వివరించారు. ఆర్బీకేల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఈవో నరసింహా, వీఏఏలు, ఎంపీఈఓలు ఉన్నారు.

గణతంత్ర వేడుకలకు హాజరుకావాలి

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 26వ తేదీన నిర్వహించే 74వ గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు సంబంధిత అధికారులు హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గణతంత్ర వేడుకల్లో పాల్గొనాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

ఆదోని రూరల్: అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం ఇవ్వాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆదోని అర్బన్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఐసీడీఎస్ సీనియర్ అసిస్టెంట్ శంకర్‌కు అందజేశారు. సీఐటీయూ సీనియర్ నాయకులు మహానందరెడ్డి, లక్ష్మన్న, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు పద్మ, సరోజ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం

కౌతాళం: వైఎస్సార్ బీమా నిరుపేదలకు వరం అని ఉరుకుంద పంచాయతీ కార్యదర్శి శ్రీరాములు అన్నారు. ఆ గ్రామానికి చెందిన మునెయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందడంతో వైఎస్సార్ బీమా నామినీగా ఉన్న భార్య లక్ష్మికి మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ సొంతంగా రూ.5 వేలను అందించగా వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉసేని నగదును అందజేశారు.

ఆదోని రూరల్: మండగిరి పంచాయతీ పరిధిలోని శాంతమల్లప్ప కొట్టాలలో నివాసముంటున్న బారిక రంగన్న చనిపోవడంతో వైఎస్సార్ బీమా పథకం కింద బాధిత కుటుంబానికి మంగళవారం రూ.10 వేల నగదును వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వరమ్మ చేతులమీదుగా అందజేశారు.

మార్కండేయ స్వామి జయంతి



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోసిగి: మండల కేంద్రంలో వెలసిన పద్మశాలి కులబాంధవుడు ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. మంగళవారం వేకువజాము నుంచి ఆలయ ధర్మకర్త వై.ఆంజనేయులు, అర్చకులు వీరేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, వెండి కవచ అలంకరణ, ఫల, పుష్పాలంకరణ గావించి వేద మంత్రోచ్ఛరణల మధ్య మహా మంగళహారతులతో విశేష పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆదోని అర్బన్: పట్టణంలోని పద్మశాలిసేవా సంఘం, మహిళా యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మార్కండేయస్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పూజ కార్యక్రమాల్లో యువ నాయకుడు జయమనోజ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత, ఏపీ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గోరంట్ల ధర్మన్న పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి పద్మశాలి మహిళలు, చిన్నారులు కలశాలతో, మేళతాళాలతో, భాజాభజంత్రీల మధ్య మార్కండేయస్వామి రథోత్సవం పురవీధుల్లో సాగింది. ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బుదార్పు లక్ష్మన్న, దేవిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంపీడీఓ పర్యటన

ఆదోని రూరల్: మేజర్ పంచాయతీ మండగిరిలోని భరత్‌నగర్ కాలనీలో మంగళవారం సాయంత్రం ఎంపీడీఓ గీతావాణి, ఆయా శాఖల అధికారులు సందర్శించి కాలనీల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో నూతనంగా వేసిన గరుసు రోడ్డును పరిశీలించారు. అనంతరం కాలనీలో కలియతిరిగి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు తమ కాలనీలో కొత్తగా అంగన్‌వాడీ కేంద్రం, స్కూళ్లను నిర్మించాలని కోరారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. పీఆర్ ఏఈ మాలిక్‌బాషా, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థి భవితకు డిజిటల్ సాయం

- బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లలో పాఠాలు
- సెలవుల్లో ట్యాబ్ ద్వారా చదువుకుంటున్న విద్యార్థులు



తరగతి గదిలో ట్యాబ్ ద్వారా అభ్యసిస్తున్న విద్యార్థులు

ఆదోని అర్బన్: విద్యా వ్యవస్థలో అసమానతలకు తావులేకుండా రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విద్యను వ్యాపారంగా మార్చిన పెట్టుబడిదారుల దోపిడీకి చెక్ పెట్టేలా మనబడి నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దింది. ప్రతిఒక్కరూ చదువుకోవాలన్న ఆకాంక్షతో విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి, కానుక తదితర పథకాలను అమలు చేస్తోంది. జాతీయ విద్యా విధానాన్ని పటిష్టంగా అమలుపరిచి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యాలు మెరుగుపడేలా జిల్లావ్యాప్తంగా బైజూస్ కంటెంట్‌తో కూడిన 32 వేల ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేసింది. డివిజన్ పరిధిలో 17 వేలు, ఆదోని నియోజకవర్గంలో 42 ఉన్నత పాఠశాలలకు 3,433 ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. రాష్ట్రంలో 4.70 లక్షల మంది విద్యార్థులకు ట్యాబ్‌ల కోసం రూ.465 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

సామాజిక అంతరాలకు చెక్

ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులకు డిజిటల్ విద్య అందడమే గాకుండా సామాజిక అంతరాలకు చెక్ పెట్టినట్లయ్యింది. ధనికులు, కార్పొరేట్ స్కూల్ విద్యార్థుల చేతుల్లో ఉన్న ట్యాబ్‌లను ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అందజేసింది. చదువులో సమానత్వం తీసుకురావడంతో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాణించేందుకు మార్గం సుగమం అయ్యింది.

బైజూస్‌తో ఒప్పందం

టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతూ విద్యారంగంలోకి విస్తరించింది. నల్లబోర్డు మాయమై డిజిటల్ బోర్డు వచ్చేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి విద్యారంగంలో ఆన్‌లైన్ దిగ్గజంగా నిలిచిన బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. బైజూస్ పాఠాలను పేద, మధ్య తరగతి విద్యార్థులకు చేరువ చేసేందుకు రూ.16వేలు విలువచేసే కంటెంట్‌తో పాటు మరో రూ.16 వేలు విలువ చేసే సామ్‌సంగ్ ట్యాబ్‌లను ఉచితంగా అందజేసింది. దీంతో ఒక్కో విద్యార్థిపై రూ.32 వేలు ఖర్చు చేస్తోంది. ఇంటర్నెట్‌తో పని లేకుండా ఇందులోని పాఠ్యాంశాలను చదువుకోవచ్చు.

సెలవుల్లోనూ ట్యాబ్‌లతో చదువులు

గతంలో పాఠశాలలకు సెలవులు వచ్చాయంటే విద్యార్థులు ఆటపాటల్లో నిమగ్నమయ్యేవారు. ఇప్పుడా పరిస్థితిలో మార్పు వచ్చింది. సంక్రాంతి సెలవుల్లో ఇంటి వద్ద ట్యాబ్‌ల సాయంతో బైజూస్ కంటెంట్‌పై ముమ్మర సాధన చేయసాగారు. గణితం, సైన్స్ ప్రశ్నలకు జవాబులు ట్యాబ్‌లోని కంటెంట్ ద్వారా విని నోటు పుస్తకాల్లో విద్యార్థులు నమోదు చేస్తున్నారు.

విద్యార్థుల బంగారు భవితకు బాట



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థుల బంగారు భవితకు బాట పడింది. కార్పొరేట్ విద్యార్థులకు ధీటుగా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు సీబీఎస్‌ఈ విధానంలో పరీక్షలు రాసేందుకు ఈ ట్యాబ్‌లు దోహదపడతాయి. ట్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యం మెరుగుపడుతుంది. తెలియని అంశాలను నేర్చుకునేందుకు ఉపయోగపడుతుంది. – రమేష్‌నాయుడు, ఆర్‌ఆర్‌లేబర్ కాలనీ స్కూల్ హెచ్‌ఎం

చాలా సులువుగా ఉంది



టీచర్లు చెప్పే పాఠాలతో పాటు ట్యాబ్ ద్వారా ఇంటి వద్ద పాఠాలను చదువుతున్నాను. ట్యాబ్‌లోని పాఠాలు ఇంగ్లిష్, తెలుగులో ఉన్నాయి. గణితం, భౌతిక, జీవ, రసాయన శాస్త్రాలు, చరిత్ర, భూగర్భ, పౌరశాస్త్రాల సబ్జెక్టులు విడివిడిగా పూర్తి సమాచారంతో ఉండడంతో సులువుగా నేర్చుకోవచ్చు. – రాణి, 8వ తరగతి

చదువుపై ధ్యాస పెరిగింది



ట్యాబ్ ఉండడం వల్ల అన్ని ప్రశ్నలకు సమాధానం దొరుకుతుంది. అన్ని సబ్జెక్టులు కూడా తెలుగు, ఇంగ్లిష్‌లో ఉన్నాయి. ట్యాబ్ ఉండడం వల్ల చదువుపై ధ్యాస మరింతగా పెరిగింది. సెలవుల్లో ఎక్కడికి వెళ్లకుండా సమయం దొరికినప్పుడల్లా పాఠాలు చదువుకుంటున్నాను. – వినయ్, 8వ తరగతి

ఇతరత్రా సమాచారం చూసుకునేందుకు అవకాశం ఉండదు



బైజూస్‌తో ఒప్పందమైన ట్యాబ్‌లో వేరే ఆప్షన్లు ఉండవు. ఇతరత్రా సమాచారం చూసుకునేందుకు పనికి రాదు. కేవలం విద్యకు సంబంధించిన సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి. దీనివల్ల ప్రతి సబ్జెక్టులో విద్యార్థులకు పట్టు వస్తుంది. – శివరాముడు, ఎంఈఓ

విద్యార్థులకు రక్త పరీక్షలు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ ఆస్పత్రి సౌజన్యంతో హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆశావర్కర్లు, సూపర్‌వైజర్లు చిలకమ్మ, విజయ, పూజ, పద్మావతి, పరిమళ సాయంతో 220 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. అలాగే రక్త పరీక్షలు, పౌష్టికాహార విశిష్టతను తెలియజేశారు. అధ్యాపకులు చంద్రశేఖర్, జొనాథన్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ తనిఖీలు



జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని అర్బన్: పట్టణంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆయా గ్రామ సచివాలయాలు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి నాణ్యమైన సామగ్రి ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అలాగే పట్టణంలోని 22వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. రిజిస్టర్ రికార్డులను, ప్రాపర్టీ ట్యాక్స్, వాటర్ ట్యాక్స్ తదితర ట్యాక్స్‌లను సక్రమంగా నమోదు చేస్తున్నారా? కలెక్షన్ చేస్తున్నారా? లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్లను మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ ఎస్ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేష వస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

జయప్రదం చేయండి

కోసిగి: మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవం విజయవంతం చేయాలని తహసీల్దార్ రుద్రగౌడ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ బూత్ వద్ద బీఎల్‌ఓలు 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. ఓటు నమోదు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రహదారి భద్రతా వారోత్సవాలు



వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్టీఓ అధికారులు

ఆదోని అర్బన్: 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బసవాసిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో రవాణా శాఖ అధికారులు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలపై నివారణ, చర్యలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో 20 మంది విద్యార్థులు పాల్గొనగా, నలుగురికి బహుమతులు వచ్చాయి. వారికి ఆర్టీఓ శివారెడ్డి, ఎంఈఐ సిసిరాదీప్తి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ.. రహదారిపై వెళ్లేటప్పుడు జాగ్రత్తగా నియమ, నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ప్రిన్సిపాల్ సాగరిక తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ఉంటాం

మంత్రాలయం రూరల్: ముస్లింలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నేత వై.సీతారామిరెడ్డి అన్నారు. మాధవరం గ్రామ ముస్లింలకు ఎన్నికల సమయంలో ఈద్గా అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం రాంపురం గ్రామంలో.. ఈద్గా అభివృద్ధి కోసం రూ.2 లక్షల నగదును వై.సీతారామిరెడ్డి చేతుల మీదుగా ముస్లిం పెద్దలకు అందజేశారు. అనంతరం వై.సీతారామిరెడ్డికి వారు పూలమాల వేసి, శాలువా కప్పి సన్మానించారు.

పాఠశాలకు బెంచీల విరాళం



బెంచీలను ప్రారంభిస్తున్న మండల విద్యాధికారిణి సువర్ణల సునియం

పెద్దకడబూరు: గ్రామీణ ప్రాంత విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలతో పాటు గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని మండల విద్యాధికారిణి సువర్ణల సునియం, ఏపీ ఏసీ ప్రొడక్షన్ మేనేజర్ శివప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని గంగులపాడు ప్రాథమిక పాఠశాలకు సింజెంటా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు 45 బెంచీలను బహుకరించారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివితే ఇలాంటి మంచి కార్యక్రమాలు ఎన్నో చేపడుతారన్నారు. సింజెంటా ఉద్యోగులు, ప్రధానోపాధ్యాయుడు వెంకటరాముడు, ఉపాధ్యాయులు, సీఆర్పీ పుష్ప పాల్గొన్నారు.

అధిక కూలి కోసమే వలస వెళ్తున్నాం



గ్రామసభలో జెడ్పీ సీఈఓ నాసర రెడ్డికి అభిప్రాయం తెలుపుతున్న వలస కూలీలు

కోసిగి(కర్నూలు): 'వర్షాకాలం పనులు ముగిసిన తర్వాత డిసెంబర్, జనవరి నెలల్లో గ్రామంలో పనులు ఉన్నా, లేకపోయినా వలస వెళ్తాం. తెలంగాణలో పత్తి పనులకు, గుంటూరులో మిరప పనులకు వెళితే అధిక కూలి వస్తుంది. ఉగాది పండుగ వరకు కుటుంబం అంతా కష్టపడితే ఎక్కువ సంపాదన వస్తుంది.' అని కోసిగి మండలం దుద్ది, కొల్మాన్‌పేట ప్రజలు తెలిపారు. మంగళవారం మండలంలోని దుద్ది, కొల్మాన్‌పేట గ్రామాల్లో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, గ్రామ సర్పంచ్ జయరాం ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి జడ్పీ సీఈఓ నాసర రెడ్డి గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వలసలపై గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తుందని గ్రామస్తులు నాగేష్, కృష్ణ, ఎల్లప్ప, నాగరాజు తెలిపారు. అయితే ఎక్కువ కూలి కోసమే తెలంగాణ, గుంటూరు ప్రాంతాలకు వలస వెళ్తున్నామన్నారు. ఏప్రిల్ మాసంలో గ్రామానికి చేరుకుని మే, జూన్ నెలలో ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులు చేసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఎన్ని సంక్షేమ పథకాలు వచ్చినా ఆ రెండు నెలలు మాత్రం తప్పక వలసలు వెళ్తామన్నారు. దాదాపు 30 ఏళ్లకు పైబడి ఇదే తమ జీవనం అన్నారు. ఏపీఓ జయరాం, ఈసీ ఉమా మహేశ్వర రావు, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మంత్రాలయంలో నీతి ఆయోగ్ బృందం



వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో సేవలను తనిఖీ చేస్తున్న నీతి ఆయోగ్ బృందం

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని కల్లుదేవకుంట పీహెచ్‌సీ పరిధిలోని మంత్రాలయం-3 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను నీతి ఆయోగ్ బృందం డాక్టర్లు సుమన్‌ఆరోరా, తాజ్‌శ్రీమిత్ర, శ్రీస్తహజారా తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, వృద్ధులు, కిశోర బాలికలకు అందుతున్న వైద్య సేవలు, ఉచితంగా మందుల పంపిణీ, పిల్లలకు అందుతున్న వ్యాధి నిరోధక టీకాల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, వైద్యాధికారులు గోవిందమ్మ, భావన, విజయరాజు జిల్లా ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ ఉమ, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, రాణి, మాధవస్వామి, భారతి, ఎంఎల్‌హెచ్‌పీలు జయంతి, రేష్మ, పీరానాయక్, వినోద్, మనోహర్ తదితరులు ఉన్నారు.

మోడల్ ప్రశ్నపత్రాలను సాధన చేయాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని అర్బన్: గత ఐదేళ్ల నుంచి పబ్లిక్ పరీక్షల్లో వచ్చిన ప్రశ్న పత్రాలను సాధన చేస్తే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు పదిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు శిక్షణా కార్యక్రమం జరిగింది. సబ్ కలెక్టర్, సమగ్ర శిక్షణ ప్రాజెక్టు అధికారి వేణుగోపాల్, డిప్యూటీ ఈఓ సుకుమార్ పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పబ్లిక్ పరీక్షలకు రెండు నెలల గడువు మాత్రమే ఉన్నందున ఈ సమయం ఎంతో కీలకమన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయుల కృషి ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి పాసయ్యేలా చూడాలన్నారు. లాంగ్వేజ్ సబ్జెక్టుల్లో కూడా విద్యార్థులు ఫెయిల్ అయ్యారంటే అది ఉపాధ్యాయుల బాధ్యత లోపమేనని, తీవ్ర పరిమాణాలు ఉంటాయన్నారు. గతంలో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉందని, పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉత్తమంగా తీర్చిదిద్దాలని సూచించారు. తాను పదేళ్ల ప్రశ్న పత్రాలన్నీ పునశ్చరణ చేసి ఐఏఎస్‌కు ఎంపికయ్యానని చెప్పారు. ఎంఈఓ శివరాములు, హెచ్‌ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలసలు పోవద్దు.. ఉపాధి కల్పిస్తాం



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కౌతాళం: ఉన్న గ్రామంలోనే ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుని కుటుంబంతో పాటు క్షేమంగా ఉండాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని పొదలకుంట, గౌతులదొడ్డి, మరళి గ్రామాలలో మంగళవారం వలసల నివారణపై గ్రామస్తులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగియడంతో డబ్బు సంపాదన కోసం దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడడంకన్నా ఉన్న గ్రామంలోనే ఉపాధి పనులు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో క్షేమంగా ఇంటి వద్దనే ఉండడం ఎంతో మేలన్నారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పిస్తోందని, ఈ పనులను సద్వినియోగం చేసుకుని పిల్లలను బడులకు పంపాలని సూచించారు. తల్లిదండ్రులు వలసలు పోవడంతో పిల్లలు బడికి దూరమై నిరక్షరాస్యులుగా మారి బాల కార్మికులుగా మారుతున్నారన్నారు. ఇకనైనా వలసలు ఆపాలని కోరారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని వంట ఏజెన్సీ వారిని ఆదేశించారు. ఎంపీడీఓ జగన్ మోహన్‌రెడ్డి, ఏపీఓ జుబేర్‌అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలిబాటలు ఏర్పాటు చేసుకోండి



పెద్దకడబూరులో వరినాట్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ఎం.వరప్రసాద్

పెద్దకడబూరు: వరి నాట్లు వేసుకునే సమయంలో రెండు మీటర్ల దూరంలో 20 సెంటీమీటర్ల మేర కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ సూచించారు. పెద్దకడబూరు గ్రామంలో వరి మడులలో మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రెండు మీటర్ల ఎడమలో కాలి బాటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా సుడిదోమ, ఇతర దోమల నుంచి పైరును రక్షించుకోవడంతో పాటు మందులను చల్లుకోవడం, పిచికారీ చేయడం సులభం అవుతుందన్నారు. నాట్లు వేసుకునే సమయంలో కొనలు తుంచి నాటుకోవడం వల్ల కాండం తొలుచు పురుగు పెట్టిన గుడ్లను నాశనం చేయవచ్చని సూచించారు. కొనలు తుంచడం వల్ల పైరుకు ఎటువంటి నష్టం వాటిల్లదని తెలియజేశారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. వ్యవసాయ సహాయకురాలు ఇందు పాల్గొన్నారు.

ఆడపిల్ల రక్షణ అందరి బాధ్యత

ఆదోని అర్బన్: ఆడపిల్లలను రక్షించడం అందరి బాధ్యత అని సమగ్రశిక్షా ప్రాజెక్టు అధికారి వేణుగోపాల్, ఇస్వి ఎస్ఐ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు బాలికలు, మహిళల చట్టాలను వివరించారు.కో-ఆర్డినేటర్ మారుతి, ప్రిన్సిపాల్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: బాలికలు కష్టపడి చదివి వివిధ రంగాల్లో రాణించాలని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నీలకంఠ సూచించారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్స్ సుధావతి, ప్రీతి, సురేఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం బాలికల చదవు కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే సాధించలేనిది ఏదీ లేదన్నారు. బాలికలు అన్నీ రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థినులకు ఆటల పోటీలు, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉరుకుందలో బహిరంగ వేలం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో బుధవారం (నేడు) వివిధ పనులకు బహిరంగ వేలం పాటల్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. దేవాలయానికి భక్తులు సమర్పిస్తున్న కలగలపు బియ్యం బ్యాళ్లను పోగు చేసుకొనే హక్కుల కోసం, లగేజీతో పాటు సెల్‌ఫోన్ భద్రపరచడం కోసం వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే స్వామి పూజల కోసం పూల పంపిణీ, అలాగే వస్త్రాల పంపిణీ, కార్యాలయానికి సంబంధించిన ప్రింటింగ్ బుక్స్ కోసం, ఎలక్ట్రికల్ మెటీరియల్స్, ప్లంబింగ్ మెటీరియల్స్ కోసం, సులభ్ కాంప్లెక్స్ మెయింటెనెన్స్ కోసం టెండర్లు పిలిచినట్లు వారు వెల్లడించారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని ఢణాపురం గ్రామంలో మంగళవారం రాత్రి పిచ్చి కుక్క దాడిలో ఒక మహిళ, చిన్నారికి గాయాలయ్యాయి. బయట తిరుగుతుండగా మహిళ లక్ష్మి, చిన్నారి పుష్పను పిచ్చి కుక్క కరిచింది. వెంటనే వారు ఆదోని ఏరియా ఆస్పత్రికి వచ్చి ఇంజెక్షన్లు వేయించుకున్నారు. అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్లారు.